నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 11 ఆగస్టు 2024 | BHADRADRI KOTHAGUDEM

విద్యానిలయాలు.. సమస్యల వలయాలు

- ఖమ్మం ఉమ్మడి జిల్లా గురుకులాల్లో సమస్యల తిష్ఠ
- విద్యార్థులకు వట్టి అన్నం.. నీళ్ల చారే
- ఇరుకు గదులు.. ఆటస్థలాలు అసలే లేవు
- పడకేసిన పారిశుధ్యం.. చిన్నారులతో వెట్టిచాకిరి
- కిటికీలు లేవు.. వర్షం వస్తే జాగారమే
- ఏమాత్రం పట్టించుకోని అధికారులు

రేపటి భావిభారత పౌరులకు విద్యా నిలయాలుగా ఉండాల్సిన గురుకులాలు సమస్యల వలయాలుగా మారాయి. చదువు సంగతి దేవుడెరుగు.. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది అధికారులు చిన్నారులతో ఏకంగా వెట్టిచాకిరి చేయిస్తూ వారి విద్యా భవితవ్యాన్ని నాశనం చేస్తున్నారు. వసతిగృహాల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత, భోజనంలో నాణ్యత లేకుండాపోయింది. ప్రహరీలు, సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో నిత్యం విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల ఆవరణంలోనే పిచ్చి మొక్కలు పెరుగుతుండడంతో పాములు, పురుగులకు భయపడిపోతున్నారు. కిటికీలు సరిగ్గా లేకపోవడంతో వర్షాకాలం గదుల్లోకి నీరు వస్తున్నది. దీంతో నిద్రపోకుండా రాత్రంతా జాగారం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో సమస్యలు తాండవం చేస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

- ఖమ్మం, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

స్థలమే కరువాయే..

విద్యార్థులతో రోడ్డుపైనే మాట్లాడుతున్న తల్లిదండ్రులు

అశ్వారావుపేట పట్టణంలోని రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి మాట్లాడుకునేందుకు కనీసం స్థలం కూడా లేదు. పాఠశాల సమీపంలోని చెట్ల కింద, రోడ్డుమీదనే నిల్చొని మాట్లాడి వెళ్లిపోతున్నారు. ఇక తరగతి గదులు సైతం విశాలంగా లేవు.. ఆటస్థలాలు లేక విద్యార్థులు మగ్గిపోతున్నారు. పట్టణంలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో సైతం సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మైనార్టీ గురుకులం మినహా బీసీ బాలుర, బాలికల గురుకులాలు ప్రైవేటు భవనాల్లోనే ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

రఘునాథపాలెంలోని బాలుర బీసీ గురుకులంలో డోర్లు సరిగా లేని మరుగుదొడ్లు

విద్యార్థులతో వెట్టిచాకిరి?

బూర్గంపహాడ్‌లోని ఎస్సీ బాలుర వసతిగృహం ఆవరణ, భవనంపై కొందరు విద్యార్థులు శుభ్రం చేస్తూ శనివారం 'నమస్తే' కంటపడ్డారు. ఆ దృశ్యాలను కెమెరాలో చిత్రీకరించి అక్కడే ఉన్న వాచ్‌మెన్ అన్వేష్‌ను ఇదేమిటని ప్రశ్నించగా స్వచ్ఛభారత్ అంటూ తమ వసతిగృహాన్ని తామే శుభ్రం చేసుకుంటున్నామని గొప్పగా చెప్పడం గమనార్హం. హాస్టల్ వార్డెన్ ప్రసాద్‌ను ఫోన్‌లో వివరణ కోరగా నేను ఇక్కడ బాధ్యతలు చేపట్టి మూడు రోజులైందని, వసతిగృహం ఆవరణ బాగోలేకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతాయని పిల్లలతో ఇలా చేయించాల్సి వచ్చిందని... మరెప్పుడూ పిల్లలతో పనులు చేయించమని చెప్పడం కొసమెరుపు.

సారపాక : బూర్గంపహాడ్ ఎస్సీ బాలుర వసతిగృహంలో పనులు చేస్తున్న విద్యార్థులు

అస్తవ్యస్తం.. బాలికల గురుకులం

బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, బాలికల జూనియర్ కళాశాల అస్తవ్యస్తంగా మారింది. గురుకుల కళాశాల ఆవరణలో గేటు సమీపంలో ఒకపక్క చెత్తాచెదారం.. మరోపక్క పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. భవనం కిటికీలకు తలుపులు లేవు.. కళాశాల ఆవరణలో మురుగునీరు నిలిచి ఉంది. 'నమస్తే' విలేకరి' శనివారం విజిట్ చేసేందుకు వెళ్లగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వరి నిరాకరించారు. ఏదైనా మాట్లాడాలని అనుకుంటే కళాశాల విద్యార్థులను ఆఫీస్‌రూమ్‌కు పిలిపిస్తాం... మీరు ఏమి అడగాలన్నా ఇక్కడే అడగండి... అంటూ దురుసుగా సమాధానమిచ్చారు.

సారపాక : తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, బాలికల జూనియర్ కళాశాల లోపల గ్రౌండ్‌లో నిలిచిన మురుగునీరు

నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో గురుకులాల సంఖ్యను పెంచి పటిష్టం చేసింది. విద్యారంగానికి పెద్దపీట వేసిన నాటి సీఎం కేసీఆర్.. విద్యార్థుల సంక్షేమం కోసం కోట్ల రూపాయలను వెచ్చించారు. గురుకుల విద్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు సకల సౌకర్యాలను కల్పించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు నాణ్యమైన విద్యను అందించింది కేసీఆర్ ప్రభుత్వం. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను పట్టించుకున్న పాపానపోలేదు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని గురుకులాలన్నీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పేద విద్యార్థులు చదువుకునే గురుకులాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి శ్రద్ధ తక్కువైంది. సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు.. ఆ సమస్యలు బయటకు పొక్కకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తే ముందుగానే నో ఎంట్రీ అంటూ చెప్పించేస్తున్నారు. లేదంటే దబాయించేసి మాట్లాడుతున్నారు. అపరిశుభ్రత, భోజనంలో నాణ్యత లేకుండాపోయింది. గతంలో 9 గంటలకు పెట్టిన స్కూళ్లు.. ఇప్పుడు ఉదయం 8గంటలకే కుదించడంతో సరిపడా బాత్రూంలు లేక విద్యార్థులు సమయానికి తరగతి గదుల్లోకి వెళ్లలేకపోతున్నారు. జిల్లాలోని ప్రతి గురుకులాల్లో సరైన సౌకర్యాలు లేవు. ప్రహరీలు, సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో నిత్యం విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల ఆవరణంలోనే పిచ్చిమొక్కలు పెరుగుతుండడంతో పాములు, పురుగులకు విద్యార్థులు భయపడిపోతున్నారు. ఖమ్మం నియోజకవర్గంలో ఏకైక మండలంగా ఉన్న రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయంలో విద్యార్థులు సవాలక్ష సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. బాత్రూంలు సరిపడా లేకపోవడంతోపాటు అపరిశుభ్రంగా ఉండడంతో ఆరుబయటే విద్యార్థులు స్నానం చేస్తున్నారు. గురుకులానికి కోతల సమస్య తీవ్రంగానే ఉంది. హాస్టల్ నిర్వాహకుల పర్యవేక్షణలేమి కారణంగా రెండురోజులక్రితం కోతులు స్వైరవిహారం చేసి నీళ్ల హౌస్‌ల్లో జలకాలాడాయి. ఆ నీటితోనే విద్యార్థులు స్నానాలు చేయడంతో విద్యార్థులకు అలర్జీ వచ్చి పలువురు జ్వరం బారినపడ్డారు. జ్వరంతో ముగ్గురు విద్యార్థులు ఇంటిబాట పట్టారు. కిటికీలు సరిగ్గా లేకపోవడంతో వర్షాకాలం గదుల్లోకి నీళ్లు వచ్చి విద్యార్థులు ఉండలేని పరిస్థితి. వర్షం వస్తే కిటికీల గుండా నీళ్లు రాకుండా విద్యార్థులు టవళ్లు, పట్టాలు పెట్టి కాపాడుకోవాల్సిన దుస్థితి. ఇక ఇక్కడ భోజనం మెనూ పాటించడం లేదు. నిత్యం వట్టి అన్నం నీళ్ల చారే దిక్కు. అదే పరమాన్నంగా విద్యార్థులకు జీరా రైస్ అంటూ నామకరణం చేసి వడ్డించేస్తున్నారు. ఉన్న గదుల్లో సరిపడా ఫ్యాన్లు లేవు.. బల్లాలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చుని పాఠాలు వింటున్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో బీసీ గురుకులాలు మొత్తం 24 ఉండగా వాటిల్లో 6,400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో రెండింటికి మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 22 అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 22 గురుకులాల్లో స్కూలు, జూనియర్ కాలేజీలు నడుస్తుండగా 2 డిగ్రీ గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఇక ఎస్సీ గురుకులాలు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా 23 ఉన్నాయి. మొత్తం 11వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో 13 సొంత భవనాల్లో, 10 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. 21 ఎస్సీ గురుకులాల్లో స్కూల్ కమ్ జూనియర్ కళాశాలలు, రెండు గురుకుల డిగ్రీ కాలేజీలుగా ఉన్నాయి.

రఘునాథపాలెంలోని బాలుర బీసీ గురుకులం

అపరిశుభ్రంగా ఉన్న పాఠశాల ఆవరణం

సమస్యలను పట్టించుకోవడం లేదు..

రఘునాథపాలెం బీసీ గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ప్రిన్సిపాల్‌కు అనేకమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. బాత్రూంలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కోతుల బెడద విపరీతంగా ఉంది. క్యాంటీన్‌లోకి వచ్చి మరీ పెంట పెడుతున్నాయి. విద్యార్థులు ఆ హౌస్‌లోని నీళ్లతోనే స్నానాలు చేస్తున్నారు. వర్షం వస్తే హాస్టల్ గదుల్లోకి నీరు వస్తున్నది. కిటికీలకు రాడ్లు, తలుపులు లేకపోవడంతో జల్లు కురిసి నీరు చేరుతున్నది. వర్షం వస్తే రాత్రంతా విద్యార్థులు జాగారం చేయాల్సి వస్తోంది.

– వీ వెంకటేశ్, పీడీఎస్‌యూ, ఖమ్మం జిల్లా కార్యదర్శి

కుళ్లిపోయిన ఉల్లిగడ్డలు

పడుకునే రూములోనే దుస్తులు ఆరేసుకున్న విద్యార్థులు

బీఆర్ఎస్ హయాంలోనే సుపరిపాలన

స్థానిక సంస్థలను బలోపేతం చేసిందే బీఆర్ఎస్

ప్రజాప్రతినిధుల అభినందన సభలో మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 10 : ప్రత్యేక అధికారాలు ఇచ్చి స్థానిక సంస్థలను బలోపేతం చేసిందే గత కేసీఆర్ ప్రభుత్వమని, దీంతోనే గ్రామాల్లో సుపరిపాలన అందిందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం జరిగిన ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీ విరమణ అభినందన కార్యక్రమంలో సండ్ర ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల పదవీ కాలంలో సభ్యులు నిస్వార్థంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారని అభినందించారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాం లో దేశంలో 20 పంచాయతీలకు.. 12 పంచాయతీలు తెలంగాణ రాష్ట్రం నుంచే ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక య్యాయని గుర్తు చేశారు. 11 మున్సిపాలిటీలు దేశంలోనే ఉత్తమ మున్సిపాలిటీలుగా ఎంపికయ్యాయని తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనతో పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. పదవీ విరమణ పొందిన ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఎంపీపీలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

'సీతారామ'ను 90 శాతం పూర్తి చేసింది కేసీఆరే..

గత సీఎం కేసీఆర్ సీతారామ ప్రాజెక్టు పనులను 90 శాతం పూర్తి చేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 10 శాతం పనులు చేసి తామే ప్రాజెక్టును తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా 35 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. సీఎం సహాయ నిధి కింద గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన చెక్కులు తప్ప ప్రస్తుతం కొత్తగా ఎవరికీ సీఎంఆర్ఎఫ్ నుంచి చెక్కులు పంపిణీ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పగుట్ల వెంకటేశ్వరరావు, దొడ్డా హైమావతి శంకర్ రావు, మాజీ జడ్పీటీసీ కూసంపూడి రామారావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ మాజీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు రఫీ, ఏన్కూరు నాయకులు వెంకటరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు అద్దంకి అనిల్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

నీటి సరఫరా నిలిపివేసిన 'భగీరథ' సిబ్బంది

ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదని ఆవేదన

వెంటనే జీతాలు విడుదల చేయాలని ఉద్యోగుల డిమాండ్

ముదిగొండ, ఆగస్టు 10 : ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో విసుగు చెందిన మిషన్ భగీరథ కాంట్రాక్టు ఉద్యోగులు శనివారం గ్రామాలకు నీటి సరఫరాను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీటిని విడుదల చేయడానికి, పైపులైన్ల నిర్వహణకు మండలంలో 14 మంది సిబ్బంది ఓ ఏజెన్సీ ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరికి నెల నెలా చెల్లించాల్సిన వేతనాలు ఏడు నెలలుగా రాకపోవడంతో కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. తనకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. దీంతో ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. అయినా వేతనాలు రాకపోవడంతో శనివారం భగీరథ నీటిని విడుదల చేయకుండా ఉద్యోగులు నిరసన తెలిపారు. దీంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ జీతాలు విడుదల చేయాలని సిబ్బంది కోరారు.

రాజకీయాల్లో బీసీలకు అన్యాయం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

హైదరాబాద్ సత్యాగ్రహ దీక్షలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



బీసీల ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఆగస్టు 10 : జనాభాలో సగ భాగం కంటే ఎక్కువగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద శనివారం బీసీ సంఘాల నాయకులు చేపట్టిన సత్యాగ్రహ దీక్షలో ఆయన పాల్గొని మద్దతు పలికారు. బీసీల న్యాయమైన హక్కుల సాధన కోసం సత్యాగ్రహ దీక్ష చేస్తున్న యువ కిశోరాలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల న్యాయమైన వాటా, కులగణన కోసం చేస్తున్న ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నానన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బీసీ అయి ఉండి కూడా కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని, రాష్ట్ర మంత్రి వర్గంలో కూడా బీసీలకు సముచిత గౌరవం లేదన్నారు. మున్నూరు కాపు, ముదిరాజ్, యాదవ, విశ్వ బ్రాహ్మణులు, రజకులు మంత్రివర్గంలో ఒక్కరూ కూడా లేరన్నారు. రిజర్వేషన్ల కల్పనకు మరింత సంఘటితమై పోరాడి న్యాయమైన హక్కుల్ని సాధించుకుందామని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రముఖులతో కలిసి సత్యాగ్రహ దీక్ష చేపట్టిన వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

ఎస్సీ రిజర్వేషన్ కోసం క్యాథలిక్‌ల ధర్నా

దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ అమలు చేయాలి

ఆర్‌సీఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాశ్ డిమాండ్

ధర్నాలో మాట్లాడుతున్న బిషప్ ప్రకాశ్

ఖమ్మం, ఆగస్టు 10 : దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు ఎస్సీ రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం మేత్రాసనం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నాచౌక్‌లో నిరసన ప్రార్థనతో ధర్నా నిర్వహించారు. తొలుత జడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి మేత్రాసనం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాశ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్యాథలిక్‌లు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బిషప్ ప్రకాశ్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయినా దళిత క్రైస్తవుల పట్ల వివక్ష కొనసాగుతోందన్నారు. దళితులు తమకు ఇష్టమైన క్రైస్తవ మతంలో చేరినంత మాత్రాన దళితుల ఆర్థిక స్థితిలో మార్పు రాలేదన్నారు. ప్రభుత్వం తరపున పలు రకాల కమిషన్లు వేసినప్పటికీ వాటి వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లభించలేదన్నారు. ప్రభుత్వాలు దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని ప్రకాశ్ కోరారు. కార్యక్రమంలో మేత్రాసనం ఎస్సీ కమిషన్ డైరెక్టర్ ఫాదర్ సెబాస్టియన్, ఫాదర్‌లు మాదాసు రాజు, కొమ్ము అంటోనీ, తప్పెట్ల శౌరి, జోజిరెడ్డి, బత్తుల జయరాజు, సిస్టర్ సుందరి, లేటి కమిటీ బాధ్యులు ఎం.ప్రసాద్, కొమ్ము ప్రసాద్, పిల్లి సుందరి తదితరులు పాల్గొన్నారు.

జోనల్ ఆఫీస్ అడ్రస్ ఎక్కడో?

గురుకుల ఆర్‌సీవోల స్థానంలో జోనల్ ఆఫీసర్లు

20 రోజులైనా స్పష్టం చేయని ఉన్నతాధికారులు

గురుకులాల నిర్వహణపై లోపించిన పర్యవేక్షణ

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 10 : గురుకుల విద్యాసంస్థల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. ఇప్పటివరకు కొనసాగుతున్న గురుకుల పర్యవేక్షణ అధికారుల స్థాయిల్లో ప్రభుత్వం మార్పులు తీసుకురావడం.. రీజినల్ కో ఆర్డినేటర్ల స్థానంలో జోనల్ ఆఫీసర్లుగా మార్పులు చేసినా.. వారు ఎక్కడ పని చేయాలో స్పష్టంగా పేర్కొనని పరిస్థితి. అంతేకాక గతంలో ఉన్న జిల్లాలకు అదనంగా మరో రెండు జిల్లాల బాధ్యతలను పెంచారు. అయితే దీనిపై విధి విధానాలను ఇంకా ప్రకటించకపోవడంతో గురుకులాల పర్యవేక్షణ గాలికొదిలేసినట్టైంది.

పరిధి పెంచారు.. మరి విధులేమిటో?

ఎస్సీ గురుకుల విద్యాలయాల పరిధిలో రీజినల్ కోఆర్డినేటర్(ఆర్‌సీవో)ల స్థానంలో జోనల్ ఆఫీసర్లు(జడ్‌వో)గా నియమించారు. గతంలో ఆర్‌సీవోల పరిధిలో 29 లేదా 30 గురుకుల విద్యాలయాలు ఉండేవి. ఇప్పుడు జోనల్ ఆఫీసర్లుగా స్థాయి మార్చిన తర్వాత ఆ సంఖ్య 45 విద్యాలయాలకు చేరింది. గతంలో ఖమ్మం ఆర్‌సీవో పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలు ఉండేవి. ఇప్పుడు జోనల్ ఆఫీసర్ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలు ఉన్నాయి. గతం కంటే ఇప్పుడు అదనంగా వరంగల్, హనుమకొండ జిల్లాలను చేర్చారు. అయితే ఆర్‌సీవోలు ఏయే విధులు నిర్వహించాలనే దానిపై జాబ్ చార్ట్ ఉన్నా.. జోనల్ ఆఫీసర్లు ఏ విధులు నిర్వహించాలనేది మాత్రం ఇరవై రోజులైనా స్పష్టం చేయలేదు.

పర్యవేక్షణ గాలికి..

విద్యాసంస్థలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తుండగా.. గురుకులాల పర్యవేక్షణను గాలికొదిలేశారు. నెలన్నర రోజుల నుంచి బదిలీల వల్ల చాలా విద్యాసంస్థల్లో మార్పులు జరగడం, పాత టీజీటీలు బదిలీ అయి కొత్త టీజీటీలు విధుల్లో చేరడం కొనసాగుతోంది. దీనికితోడు పదోన్నతులు కూడా చేపడుతున్నారు. అయితే వీటన్నింటినీ పర్యవేక్షించాల్సిన ఆర్‌సీవోల స్థాయిని కూడా మార్చడంతో గురుకుల విద్యాలయాల పరిధిలోని స్కూళ్లు, కళాశాలలను తనిఖీ చేసే వారు కరువయ్యారు. గురుకుల విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసే విషయంలో ఆయా గురుకుల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుంటే మినహా మరో అధికారి లేకపోవడంతో ఖాళీలకు సంబంధించిన సమాచారం కూడా విద్యార్థులకు అందే పరిస్థితి కనిపించడం లేదు.

జోన్ జడ్‌వోగా స్వరూపరాణి

ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలను ఒక జోన్‌గా చేశారు. దీనికి జోనల్ ఆఫీసర్(జడ్‌వో)గా స్వరూపరాణిని నియమించారు. ఈ క్రమంలో వరంగల్ కేంద్రంగా కార్యాలయం నిర్వహించేందుకు అధికారులు ఆలోచన చేయగా.. ఖమ్మంలో అత్యధికంగా గురుకులాలు ఉన్నాయని వివరించడంతో ఎక్కడ జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలనే దానిపై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సుమారు 20 రోజుల నుంచి జోనల్ అధికారులు ఎక్కడ విధులు నిర్వహించాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఐదు జిల్లాల పరిధిలో ఐదుగురు కలెక్టర్లకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితితోపాటు సమీక్షలకు హాజరు కావాలంటే తలకు మించిన భారంగా మారనున్నది.

వైఎస్ఆర్ కాలనీలో మంత్రి తుమ్మల పర్యటన

కాలనీ అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు

రఘునాథపాలెం, ఆగస్టు 10 : ఖమ్మం అర్బన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్ కాలనీలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పర్యటించారు. స్థానిక 8వ డివిజన్ కార్పొరేటర్ లకావత్ సైదులు విజ్ఞప్తి మేరకు డివిజన్‌లో పర్యటించిన మంత్రి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పలు సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకరావడంతో కాలనీ అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఈఈ కృష్ణలాల్, కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల

'పాలెం'లో సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ పర్యటన

రఘునాథపాలెం, ఆగస్టు 10 : ఖమ్మంజిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి శనివారం రఘునాథపాలెం మండల కేంద్రంలోని విత్తన గిడ్డంగి సంస్థను సందర్శించారు. స్థానికంగా ఉన్న విత్తన గోదాములను పర్యవేక్షించారు. అనంతరం రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రైవేటు కంపెనీల కన్నా మంచి దిగుబడిని అందించే విత్తనాలను కార్పొరేషన్ అందిస్తున్నదని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఆదినారాయణరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ వినయ్, ఆర్ఎం భిక్షం, బాలాజీనాయక్, నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న అన్వేశ్‌రెడ్డి

కోర్టు డ్యూటీ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మామిళ్లగూడెం, ఆగస్టు 10 : కోర్టు డ్యూటీ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ప్రతి కేసులోనూ నిందితులకు శిక్షపడే విధంగా ఆధారాలు సమర్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులను కట్టడి చేయాలంటే సరైన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక, వైద్యపరమైన ఆధారాలను సేకరించి సరైన పద్ధతిలో కోర్టుకు సమర్పించాలన్నారు. ఎప్పటికప్పుడు సీసీ నెంబర్లు పొందేలా చూసుకోవాలని, సాక్షులు, ముద్దాయిలు కోర్టుకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టు క్యాలెండర్ కారెంట్స్, సమన్స్ తదితర అంశాలపై సమీక్షించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను క్రమం తప్పకుండా అమలు చేసి కేసుల్లో నిందితులను దోషులుగా నిరూపించాలన్నారు. పెండింగ్ కేసులకు సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల ప